# ఒక స్వప్నం

పద్మావతి తిట్లతో ఆ వీధి వీధంతటా నిద్ర ఎగిరిపోయింది. నేడో రేపో కోసుకోవాలనుకుంటున్న తమ పెరట్లోని అరటిగెల కనిపించలేదట. ఆ దొంగని తిడుతున్నది. వాడి ఇల్లు వల్లకాడయిపోవాలంది. ఊరమ్మోరుకు మొక్కుకున్న ఆ అరటి పండ్లు తిన్నవాళ్లు కక్కుకుని కక్కుకుని చస్తారంది. ఆ దొంగని చూసి చెప్పనోళ్ల కళ్లు పేలిపోతాయంది. దొంగతనం చేసిన ఆ చేతులకు పెద్దరోగం రావాలంది. ఆళ్ల ఇంట పీనుగు వెళ్లాలనీ, ఆళ్ల కుద్ద కూలిపోవాలనీ. అవి తిట్లు కావు. అవి శాపాలు కావు కల్లాపు చల్లుతున్నా, ముగ్గులు వేస్తున్నా, గేదెకు కుడితి పెడుతున్నా ఆ తిట్లు మాత్రం ఆగవు.

ఆ అమ్మాయి చూట్టానికి పొడుగ్గా పూలదండలా ఉంటుంది. నిండైన పెదాలతో వెడల్పాటి ముఖం. పచ్చ బంగారంలా మెరిసే ఒంటి రంగు. దానికి తోడు రోజూ తెల్లవారే ఇంత పసుపుముద్ద నూరుకుని ఒంటికి రాసుకుని స్నానం చేస్తుంది. కానీ, నోటినిండాతిట్లే. రాలుగాయీ, గయ్యాళీ అంటారంతా. తల్లి రాధమ్మకిగానీ, తండ్రి పట్నాయక్‌కిగానీ జగడం అంటే పడదు. దీని అన్న సూర్యం పట్నాయక్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అంటే నమ్మరు. అంత నెమ్మదస్థుడు. పొరుగు రాష్ట్రం ఒరిస్సాలో మామగారింట చదువుకుని అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ఆ తల్లీ తండ్రీ నోరులేని వాళ్లు. అట్లాంటివాళ్ల కడుపులో ఈ జగడాలమారి, కయ్యాలకోరు పుట్టిందంటే

వింతగానే ఉంటుంది. ఆ అమ్మాయి తాత గ్రామకరణంగా ఊళ్లో వాళ్ల జుత్తులు ముడివేసేవాడని చెప్పుకుంటారు. ఆ వారసత్వాన పుట్టిందో ఏమో. ఆ తాతగారు కట్టిందే ఈ ఇల్లు. ఇద్దరు కొడుకుల కోసమని రెండు వాటాల పెంకుటిల్లు కట్టించాడు. ఏభై అరవైయేళ్ల కిందటే పెరటి ప్రహరీ కట్టించుకున్న ఇళ్లు ఆ ఊళ్లో నాలుగయిదుకన్నా ఎక్కువ ఉండవు. వాటిలో ఇదొకటి.

పెళ్లి చేసుకుని కాపురానికి వెళ్లి నిండా నెలదినాలు కూడా నిండకముందే మొగుణ్ణి వదిలేసి వచ్చిందంటే కారణం ఆ తిట్టే నోరేనట. ఆ నోటి ఒడుసుతనంతో మొగుడు వచ్చి పిలిచినా — వెళ్లక విడాకులదాకా తెచ్చుకుందట. కాపురం చేసి ఉంటే ఇద్దరు పిల్లల తల్లి అయి ఉండేదని తల్లి మొరపెట్టుకుంటుంది. అప్పుడు పద్మావతి ఆ పిల్లల్ని తిట్టుకుంటూ బతికేదేమో.

తండ్రి ఉబ్బసం దగ్గు ఎప్పుడూ ఉన్నదే. ఈసారి నెలదినాల నుంచి విడుపూ విరామం లేకుండా సాధిస్తున్నదా దగ్గు. ఆరోగ్యం మరింత పాడయింది. ఆస్పత్రిలో చేర్పించాలని కొడుకు బలవంతం చేసినప్పుడల్లా ఇది ఆస్పత్రిలో నయమయ్యే జబ్బు కాదని, డబ్బు ఖర్చు మాత్రమేనని, ఇంటి దగ్గర కూతురుకు తోడెవరూ ఉండరని, ఊరు విడిచి కొత్త చోటుకు వెళ్లడానికి తండ్రి ఒప్పుకోలేదు. ఈసారన్నా ఈ దగ్గు బాధ భరించలేక మనసు మార్చుకుని కొడుకుతో వెళ్తాడో ఏమో.

పద్మావతితో గొంతుకలిపి ఊరును నిద్రలేపుతున్నట్లు కోళ్లు అరుస్తున్నాయి. ఒక మేకపిల్ల దూరంగా కట్టుమీదున్న తల్లి కోసం ఆకలాకలని తల్లడిల్లిపోతున్నది. పసిపాప ఏడుపు ఎక్కడ నుంచో వినిపిస్తున్నది. హరేకృష్ణ వాళ్ల భజన వీధిలోంచి పోతున్నది. మృదంగ తాళ వాద్యాలతో సాగే వాళ్ల భజన పాటల్ని సైతం పద్మావతి తిట్లు తినేస్తున్నాయి.

"నోటి దగ్గర కొచ్చింది పోయింది. పోతే పోయిందిలే. తిట్టొద్దమ్మా. మనకు ప్రాప్తం లేదు. ఏం చేస్తాం? తిడితే వస్తాదా?" అని తల్లి కోప్పడుతున్నా పద్మావతి తిట్లు ఆపదు. పాలు పితుకుతున్నప్పుడు సైతం తిట్లు ఆపలేదు. పద్మావతి తిట్లకు ఆ పాడి గేదె అలవాటు పడిపోయినట్లుంది. చలించదు. పద్మావతి కోపం అంత త్వరగా చల్లారదు. ఆ రోజంతా మండుతూనే ఉంటుంది.

పద్మావతికి చలి ఉండదు. చీకటి ఉండదు. ఎండ ఉండదు. సుఖం ఉండదు. కష్టం ఉండదు. నిద్ర ఉండదు. ఊరుకు ముందే లేచి కూర్చుంటుంది. ఉబ్బసం దగ్గుతో కఫం ఉమ్ముకుంటూ ఎగశ్వాసతో ఊపిరాడక రాత్రంతా బాధపడే తండ్రికి మధ్య మధ్య వేడి వేడి టీ చేసి ఇస్తుంది. తండ్రితో కొంచెం సేపు కూర్చుంటుంది.

తల్లి కూడా జబ్బుమనిషే. వాళ్ల సేవకోసమే ఈ అమ్మాయి పుట్టిందేమో. వాళ్ల సేవ కోసమే ఆ మొగ్గుణ్ణి వదిలేసిందేమో. వాళ్ల కులంలో మారుమనువు లేదుకదా. విడాకులిస్తే దీని బతుకు ఏమయిపోతుందో కదా అని తమ చేతులతో పెళ్లి చేసిన పెద్దలు అడ్డం పడ్డారు. పిల్ల తొందరపాటుతో కాపురం చెడరాదని నచ్చచెప్ప బోయారు. ఆ నచ్చచెప్పబోయిన పెద్దలంతా పద్మావతితో తిట్లు తిన్నారు. సర్పంచి శివన్నాయుడు లాంటి పెద్దమనిషికి సైతం తిట్లు తప్పలేదు. చిన్నవయసులో మొగుడు వద్దనుకుని ఎన్నాళ్లు ఉంటుందని వాళ్ల చింత. లేకపోతే కనకాంబరం పెళ్లాంలాగా ఎవడితోనో లేచిపోవాలి.

అమ్మోరుగుడిలో అయ్య పూజారయితే, కొడుకు చేసిన పాపాలు పోతాయా? ఆ అమ్మోరు చూడదా — ఈడిని తినెయ్యదా — అన్న తిట్టుతో — ఆ తిట్లూ ఆ శాపాలూ ఆ నిందలూ ఆ కోపమూ ఆ ఉక్రోషమూ ఆ పగా ఎవరిమీదో ఊళ్లో జనాలకి తెలిసి పోయింది.

ఆ ఊళ్లో జనం భయపడే మనుషులు ఇద్దరే ఇద్దరు. ఒకరు — పద్మావతి. రెండో మనిషి రమేష్ పండా. వాడు పాతికేళ్ల వయసులో ఊరును గడగడ లాడించాడు. అట్లాంటి రమేష్‌పండాతో తలపడి కత్తులు నూరుతున్నదంటే పద్మావతికి జేజేలు చెప్పాల్సిందే.

మూడేళ్ల కిందట సత్యం దొర ట్రాక్టర్ ప్రమాదం వార్తతో రమేష్ పండా పేరు ఆ జిల్లా పోలీస్‌స్టేషన్‌ల అన్నిటా, న్యాయస్థానాల అన్నిటా మార్మోగి పోయిందట. రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం అని పంపిన వార్త, ట్రాక్టర్ కిందపడి, అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి చనిపోయాడు అని పత్రికలో అచ్చుకావటంతో కొంపలు అంటుకున్నాయట. ఆ ప్రమాదంలో చనిపోయిన రాఘవులు స్థానిక అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి కావటంవల్ల సంతాపసూచకంగా వెంటనే ఊళ్లో బంద్ పాటించారన్న వాక్యాన్ని శీర్షికను చేసుకోవటంతో ఆపద వచ్చిపడిందనీ, తన ఉద్దేశం అది కాదని సంజాయిషీ చెప్పుకున్నా రమేష్ పండా మాటని అప్పట్లో జనం నమ్మలేదట. కావాలనే చిచ్చుపెట్టాడనుకున్నారట. సత్యందొర అసలు నమ్మలేదట. వాళ్లమధ్య అప్పట్లో కొత్త తగువవల్ల రమేష్ పండాతో మాట్లాడటానికి సత్యందొరకి ముఖం చెల్లలేదట. ఇంత ఆపద ముంచుకు వస్తుందని అసలు ఊహించలేదట. అయితే, వాళ్లిద్దరూ ఇప్పుడు ఒకరికొకరు కావలసిన వాళ్లయిపోయారట. అది వేరే సంగతి.

అంతోటి రమేష్ పండాని అరటిగెల దొంగతనం పేరుతో పద్మావతి శాపాలు

పెట్టి తిడుతున్నదంటే బాగు బాగు. పద్మావతి సాహసానికి జోహార్లు. అరటి గెల దొంగతనం రమేష్ పండా మప్పి చేయించిందే అని పద్మావతి తిట్ల సారం.

రమేష్ పండా చూట్టానికి వంకర మనిషిలా కనిపిస్తాడు. ఆ ఊళ్లోనూ, ఆ చుట్టుపక్కల ఊళ్లలోనూ అధికారులూ, రాజకీయ నాయకులూ, మంత్రులూ పర్యటించినప్పుడు పత్రికలకు రాసిన ఉత్తరాలతో రమేష్ పండాకి ముందు విలేఖరి అన్న పేరు వచ్చింది. ఇప్పుడది పదవి అయింది.

వార్తలకు కొదవ లేదన్నట్లుగా ఆ ఊళ్లో పోలీస్‌స్టేషన్ ఉంది. మండల కార్యాలయం, మండల ప్రజాపరిషత్, ప్రభుత్వ ఆస్పత్రీ, గ్రామపంచాయతీ, సినిమాహాలూ, రైస్‌మిల్లూ, బ్యాంక్, ఉన్నతపాఠశాలా, కొత్తగా వచ్చిన మద్యనిషేధమూ, ఇంకా ఎప్పటికప్పుడు వచ్చిపడే ఎన్నికలూ, ప్రజాస్వామ్యమూ, పేద ప్రజలూ, పెద్ద కులాలూ, ప్రభుత్వ నిధులూ, వాటికోసం కాసుకుకూర్చున్న తిమింగిలాల వంటి కాంట్రాక్టర్లూ, సంబంధించిన అధికారులూ, ఊరునిండా తలలు ఎగరేసుకు నుంచున్న వివిధ రాజకీయ పార్టీల రంగురంగుల జెండాలూ, బస్సులూ, లారీలూ, జీప్‌లూ — పెద్ద జాబితానే తయారవుతుంది.

ఒక మామూలు పల్లెటూరు నుంచి పతాక శీర్షికలను పుట్టించగల తెలివి తేటల మూలంగా ఆ ఊళ్లోని చిన్నా పెద్దా ఉద్యోగులంతా రమేష్ పండా ఎదురయినప్పుడల్లా నవ్వుముఖాలూ, నమస్కారాలూ, ఇచ్చిపుచ్చుకోవడాలూ అలవాటు చేసుకున్నారు.

ఉద్యోగులంతా దొంగలే, లంచగొండులే అన్నట్లూ ఎక్కడా గతిలేక ఈ ఊరొచ్చి ఇక్కడ బతుకుతున్నట్లూ వాళ్లంటే అతనికి చిన్నచూపు. తన సొంత ఆస్తిని, పరాయివాళ్లు వచ్చి ఊరికే పనీపాటూ లేకుండా తినేస్తున్నారని అతని ఉద్దేశం. ఏ చిన్న అవకాశం దొరికినా ఉద్యోగస్థులకు వ్యతిరేకంగా పత్రికలో వార్తలు అల్లేవాడు.

అట్లాంటి రమేష్ పండాని ఊరంతా వినిపించేట్లు పద్మావతి చెరువుకు వెళ్లివచ్చే దారిపొడవునా, తెలుగువాళ్లు ఎదురైనప్పుడు తెలుగులోనూ, ఒరియావాళ్లు ఎదురయినప్పుడు ఒరియాలోనూ తిట్ల పాండిత్యంతో తిడుతుంటే, ఈ కయ్యాలకోరు పెద్దకయ్యమే పెట్టుకుందని ఆలోచనలో పడ్డారు విన్న ఊళ్లో జనం.

తెల్లగా తెల్లవారిన తర్వాత చూస్తే నిజమే — పట్నాయక్ వాళ్ల పెరట్లో అరటిగెల కనిపించలేదు. ఆ అరటి గెలకి దిష్టి తగిలినట్లుంది. పెరటి ప్రహరీ గోడ ఎక్కితే చేతికి అందేటట్లున్న అరటిగెలను దొంగ అందుకున్నట్లు బోధపడింది.

అంతలో తండ్రి దగ్గు ఆగిపోయింది. దాంతో పద్మావతి తండ్రి మంచం వేపు చూసింది. రాత్రంతా దగ్గి దగ్గి పుండయి పోయిన ఊపిరితిత్తులు ఉదయం చల్లగాలికి

సొమ్మసిల్లి చిన్న కునుకు పట్టినట్లుంది ఆ ప్రాణికి. అది గమనించిన పద్మావతి నోరు మూతపడింది.

* * *

ఆ ఊళ్లో తొలిసారిగా ఉద్యోగంలో చేరినప్పుడు పల్లెటూళ్లు ఇట్లా ఉంటాయా అని భయపడిపోయాడు భాస్కరం. బ్యాంక్ ఉద్యోగంలో చేరితే డబ్బు ఈ ప్రపంచాన్ని ఎలా నడుపుతుందో తెలుసుకోవచ్చని, ప్రపంచంలో డబ్బు మాయ గురించి తెలుసుకోవడానికి ఉద్యోగం మంచి అవకాశమనీ బ్యాంక్ ఉద్యోగం పట్ల మోజు పడ్డాడేకాని ఈ ఉద్యోగంలో స్థిరంగా ఉండిపోవాలని కానేకాదు. నిజానికి ఈ దేశంలోనే ఉండాలని లేదు భాస్కరానికి. అప్రయత్నంగా వచ్చిన ఉద్యోగం. పల్లెటూరు చూడొచ్చు అని సరదాపడి ఆ ఊళ్లో అడుగుపెట్టాడు. వారం దినాలకే ఊళ్లల్లో ఉద్యోగం శిక్ష అనుకున్నాడు. ఆ శనివారం ఇంటికి వెళ్లినప్పుడు ఆ పల్లెటూళ్లో ఉద్యోగం చెయ్యలేను అని తండ్రితో స్పష్టంగా చెప్పేశాడు. తండ్రి మాట్లాడలేదు. తల్లి మాత్రం ఒప్పుకోలేదు.

'ఆ ఊళ్లో ఉన్న జనమంతా బతకటం లేదా? వాళ్లు బతికినట్టే నువ్వూ బతుకు. నీకు విశాఖపట్నంలోనే ఉద్యోగం కావాలంటే దొరకదు. ఒక ఏడాది చెయ్యి. బదిలీ చేయించుకో. ఈలోపు నీ అదృష్టం బావుండి వేరే ఉద్యోగం వస్తే మానుకోవచ్చు. లేదా మీ బావగారి ప్రయత్నం ఫలించిందా అమెరికానే వెళ్లొచ్చు. కోరి కాళ్ల దగ్గరకొచ్చిన ఉద్యోగాన్ని కాదనకు. మనది కూడా ఒకప్పుడు పల్లెటూరే అన్న సంగతి మర్చిపోకు' అని తల్లి నచ్చజెప్పబోయింది.

"ఆ ఊరు ఎంత కంపుగా ఉంటుందో నీకు తెలియదమ్మా. రోడ్డంతా ఓపెన్ పబ్లిక్ టాయ్‌లెట్. ఛీ ఛీ. తెల్లవారిపూట లేదా సాయంత్రం చీకటి పడ్డ తర్వాత రోడ్డు మీద అడుగు పెట్టలేం. రోడ్డుకు రెండువేపులా ఆడవాళ్లు. ఉదయప్పూట కాలకృత్యాలు తీర్చుకోవాలంటే కిలోమీటరు దూరం నడచి వెళ్తే తప్ప మరుగు కనిపించదు. అట్లాంటి కంపు ఊరు" అని కచ్చితంగా తన నిర్ణయం గురించి ఇంట్లో చెప్పేశాడు భాస్కరం.

పందొమ్మిది వందల తొంబై అయిదులో సైతం దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నలభై ఎనిమిదేళ్లు గడచినప్పటికీ ఆ ఊళ్లు ఇంత కంపుగా, మురిగ్గా, రోగిష్టిగా, జనం ఇంత దరిద్రంగా, సోమరిగా, అంగాలు ఊడిపోయిన పెద్దరోగుల్లా కనిపిస్తుంటే భయపడి పోయాడు భాస్కరం. ఎవరూ పట్టించుకోరు. ఎవరికీ సిగ్గనిపించదు.

లేనివాళ్లు సరే. ఉన్న వాళ్లన్నా మరుగుదొడ్లు కట్టించుకోకూడదా? ఆడవాళ్లు, పిల్లలు, ముసలివాళ్లు — అంతా రోడ్డుమీదే. కనీసం రోడ్డుకు దూరంగానన్నా పోరు. గుర్తొస్తే తిన్నది వాంతవుతుంది. ఆ ఒక్క ఊరే కాదు. ఇరుగు పొరుగు ఊళ్లు కూడా అంతే. పశువులకూ, మనుషులకూ మధ్య ఏ భేదం లేకుండా ఉంది అక్కడ బతుకు. ఊళ్లో యువకులు తలచుకుంటే నెలదినాల్లో శాశ్వతంగా ఈ సమస్య పరిష్కారం అవుతుంది. ఊరు పరిశుభ్రమవుతుంది. రోగాలు తగ్గుతాయి. మనుషులు ఆరోగ్య వంతులు అవుతారు. గ్రామ పరిశుభ్రత గురించి కనీసపు స్పృహ కూడా లేకుండా ఇన్ని శతాబ్దాలుగా బతుకుతున్న జాతి — ఘనత వహించిన మన భారత జాతే అనిపించి తనపట్ల తనకు ఆగ్రహం కలిగింది. నీ ఆటంబాంబులూ, అంతరిక్ష ప్రయోగాలూ, నాగ్‌లూ, ఆకాష్‌లూ, అగ్నులూ— అభివృద్ధీ, స్వేచ్ఛావిపణీ తగలడ... భాస్కరం మనసు కుతకుత ఉడికిపోయింది.

కానీ, రెండోసారి ఆ ఊరు రాక తప్పలేదు. ఆరోజు తన సూట్‌కేస్ తీసుకు పోలేదు. ఆ శనివారం చివరిబస్సు కనిపించేసరికి ముందు బస్సులో దూరిపోయాడు. అక్కడనుంచి వెంటనే పారిపోవాలనిపించింది.

సూట్‌కేస్ తీసుకుపోవటం కోసం మళ్లా ఆ ఊరు ఇప్పుడు రావాల్సి వచ్చింది. ఈసారి తన తోటి ఉద్యోగులందరితో ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పి మరీపోవాలనిపించింది. ఆ ఊళ్లో మురికి బతుక్కు నిరసనగా తాను ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పాలనిపించింది. ఉద్యోగం మానుకుంటున్నవాడికి సెలవు అవసరం మాత్రం ఏముంది? మూడురోజుల తర్వాత ఓ సాయంత్రం వచ్చాడు. శంకర్రావుకు అతిథి. నాయర్ హోటల్‌లో ఆ రాత్రి భోజనం.

ఆ రెండో రోజు ఉదయం బాగా పొద్దెక్కిన తర్వాత — ఊళ్లోంచి పోయే ఆ కంపు రోడ్డు పొడవునా ముక్కు మూసుకుని పంటపొలాల మధ్యనుంచి పోతున్న రోడ్డమ్మట — ఊరు కనిపించనంత దూరం పోయి, కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి ఒక్కడూ వస్తుంటే, ఊరుకు తూర్పున ఉన్న కోనేరు గట్టుమీద నీళ్లబిందెతో, స్నానం చేసిన తడిబట్టలతో, మందారపు రంగు అంచు ముదురాకుపచ్చ చీరతో, నిండుయౌవనంతో ఊగిపోతున్న ఓ అమ్మాయి అమాంతం ఎదురయింది. తన మీద పడుతున్నట్లు వచ్చిందామె. చూసుకోలేదు. చూపులు వర్షపుమేఘాల్లా ఢీకొని ఒళ్లంతటా మెరుపులు మెరిశాయి. అంతలోనే ఆ చూపులు గడ్డకట్టుకు పోయాయి. అవి పరిమళాలై, వెన్నెలలై, తేనెలై ఆటబొమ్మను చేసి ఆడించసాగాయి. ఈ భూమ్మీద పడిన ఇరవైనాలుగోఏట తొలిసారిగా స్త్రీని చూసినట్లయింది. జన్మజన్మల వెతుకులాట

తర్వాత కలుసుకు న్నట్లయింది. అమ్మవారి మండపానికి వెళ్లివచ్చే జనం తనను చూస్తారన్న స్పృహ చాలాసేపు అతడికి కలగలేదు. మిగిలిన ప్రపంచం ఉన్నట్లే అనిపించలేదు. తళతళ మెరుస్తున్న ఉదయపు బంగారు ఎండకీ, కళకళలాడు తున్న కోనేటి నీటి అలలకీ ప్రాణం పోసినట్లుగా ఉందా అమ్మాయి. ప్రపంచం తనకోసం ఈ కానుకను ఇక్కడ సృష్టించినట్లు అనిపించింది ఆ క్షణం. దాంతో మొట్టమొదటసారిగా సూర్యుణ్ణీ, ఆకాశాన్నీ చూసి నట్లయింది. ఆకాశం నీలంగా ఉందని ఆ రోజే తెలిసింది. చెట్లు పచ్చ పచ్చని ఆకులతో, రంగురంగుల పూలతో అలంకరించుకుంటాయని ఆ రోజే గుర్తించాడు. అంతవరకు అతడి కళ్లకు చూపేలేనట్లు, ఆ రోజే చూపు కొత్తగా విచ్చుకున్నట్లూ అయింది. అమ్మవారి మండపం చుట్టూరా ఉన్న రావి, మామిడి, వేప, చింతచెట్ల కొమ్మల్లో ఆడుకుంటున్న పిట్టల అరుపులు అతడి చెవికి ఎంతో ముద్దుగా వినిపించసాగాయి.

అతడికి తిరిగి ప్రపంచస్పృహ వచ్చేసరికి చంకన నీళ్లబిందెతో, స్నానంచేసి వచ్చి తడిబట్టలతో ఎదురయిన అమ్మాయి... అతడికి కనిపించలేదు. చుట్టూ వెతికాడు. కోనేటి రేవు పావంచాల మీద, బిందెలతో పోయే ఆడవాళ్లల్లో, కోనేరు గట్టుమీద చెట్ల నీడల్లో, అమ్మవారి మండపంలో పూజలు చేసి వస్తున్న భక్తజనంలో వెతికాడు. ఎంత వెతికినా ముదురాకు పచ్చరంగు చీర జాడ కనిపించలేదు. దేవత ప్రత్యక్షమై అదృశ్యమైపోయిందా అన్న అనుమానం కలిగింది కొంతసేపు. నిజంగానే తాను చూశాడు. తన రెండుకళ్లతో తన ఎదురుగా చూశాడు. నిండుయౌవన భారంతో ఊగిపోతున్న పడుచును తన కళ్లతో స్వయంగా చూశాడు. ఇప్పుడే ఇక్కడే చూశాడు. కోనేరు గట్టు మీద ఈత చెట్ల దగ్గరే ఇంతసేపు తాను నుంచునే ఉన్నాడు. అమ్మవారి మండపంలో పూజలు జరుగుతున్నాయి. మరి ఈ ముదురాకు పచ్చరంగు చీరమ్మాయి ఏమయిపోయినట్లు? భాస్కరం ఊరు వేపు సాగి దారి పొడవునా వెతికాడు. రెండు మూడు వీధులు పనిగట్టుకుని తిరిగి వెతికాడు. ఆమె జాడ కనిపించలేదు. ఆ అమ్మాయిని మరోసారి చూడకుండా బతకలే ననుకున్నాడు. బతుకు లేదనుకున్నాడు.

ఆ రోజు తాను బ్యాంకులో చెప్పాలనుకున్న తన రాజీనామా సంగతి చెప్పలేకపోయాడు. రాజీనామా నిర్ణయం వాయిదా పడింది.

'మీకోసం ఇల్లు చూశారట శివన్నాయుడు గారు. కబురు చేశారు' అని చెప్పారు మేనేజర్ రంగనాథం. 'శివన్నాయుడు గారిని వెళ్లి కలవండి' అని సలహా ఇచ్చారు ఆయన.

ఈ ఊరు తనను వదిలేట్లు లేదు అనుకున్నాడు భాస్కరం.

పోగొట్టుకున్న వస్తువును వెతుక్కోవటానికి అన్నట్లుగా ఆ ఊరు తను వచ్చినట్లు అనిపించసాగింది భాస్కరంకి.

ఆ సాయంత్రం మళ్లీ వెళ్లాడు కోనేటిగట్టుకి. అమ్మవారి మండపంలో పూజలు ఎక్కువయ్యాయి. తండ్రి దేవీభక్తుడు. లలితా సహస్రనామ పఠనం వినిపించింది. అమ్మవారంటే భక్తితో కాదు. తాను వెతుకుతున్న దేదో అక్కడ తనకు దొరుకుతుందని ఆశ. పసుపు రాసుకున్న కొత్త బట్టలు కట్టుకున్న ఆడవాళ్లతో ఆ కోనేరుగట్టు కిటకిటలాడుతున్నది. అమ్మవారి పండుగట. తనకు తెలిసినవాళ్లు ఎవరూ అక్కడ లేరు. ఆ కొత్త మనుషుల మధ్య ఎక్కువసేపు ఉండటం ఇబ్బందయింది. విచిత్రంగా తనను వాళ్లు చూస్తున్నట్లుగా కూడా అనిపించింది. ఆ అమ్మాయి కనిపిస్తుందని అతడి ఆశ, నమ్మకం.

పదిహేను రోజుల తర్వాత ఓ శుక్రవారం ఉదయం పంతులు గారిని వెంటతీసుకుని సర్పంచి శివన్నాయుడుగారు పూజా సామానులతో, శ్రీరామ పట్టాభిషేకం పటంతో తనను తీసుకువెళ్లి, పొరుగున ఉన్న రాధమ్మగారింటి నుంచి కుంపటి తెప్పించి, పాలు పొంగించి 'ఈ ఊళ్లో ఇంతకన్నా సదుపాయమైన ఇల్లు మరొకటి లేదు భాస్కరం. చిన్న పట్నాయక్‌ది. అంటే, ఈ రాధమ్మ మరిదిగారి దన్నమాట. చిన్న పట్నాయక్ ఇప్పుడు కటక్‌లో స్థిరపడ్డాడు. వాళ్లకి కట్టెలఅడితీ ఉంది. వ్యాపారం చేసి బాగుపడ్డాడు' అని వివరాలు చెప్పారు శివన్నాయుడుగారు.

'చిన్నబాబూ, ఇల్లు తీసుకున్నావా' అని ఇప్పటికే అమ్మ చాలాసార్లు అడిగింది. శివన్నాయుడుగారు చెప్పింది నిజమే. ఈ ఊళ్లో ఇంతకన్నా మంచి ఇల్లు దొరకటం కష్టమే.

'రాధమ్మా, పద్మా — రండి ప్రసాదం తీసుకోండి' అని పక్క ఇంట్లో వాళ్లను పిలిచి 'భాస్కరం పాలు తూర్పుకు పొంగాయి, శుభమే' అని సంతోషించారు శివన్నాయుడుగారు. పంతులుగారు మంత్రాలు చదువుతున్నారు.

ముందు పద్మావతి వచ్చింది. ఈమెను ఎక్కడో చూసినట్లనిపించింది భాస్కరానికి. అయితే, ఆ ఇంట్లో దిగేవరకు ఆమె ఘనకీర్తి గురించి మాత్రం భాస్కరం వినలేదు. ఆ రోజు బ్యాంకులో తాను శివన్నాయుడుగారు చెప్పిన చిన్నపట్నాయక్‌గారి పెంకుటింట్లోకి మారిపోయిన సంగతి చెప్పినప్పుడు 'ఆ గయ్యాళి పొరుగున పడ్డావా తండ్రీ, నెల దినాలు కూడా అక్కడ ఉండలేవు' అని బెదిరించారు తోటి బ్యాంక్ ఉద్యోగులు.

అట్లాంటిది మూడు నెలలయింది. అప్పటినుంచి రోజూ పద్మావతి తిట్లు వింటూనే ఉన్నాడు భాస్కరం. ఒకసారి రేషన్‌షాపు వాడిని తిడుతుంది. మరొకసారి — పాలు రోజూ పోయించుకుని జీతంనాడు పైసలు ఇవ్వని తెలుగు మేష్టర్ని తిడుతుంది. ఆస్పత్రిలో కాంపౌండర్‌నీ, అతనిపెళ్లాన్నీ తిట్టుంది. వాడి చూపుల్ని తిడుతుంది. ఇరుగు పొరుగు వాళ్లతోనయితే నిత్యమూ యుద్ధమే. హడలెత్తి పోయి వాళ్లు నోళ్లు విప్పరు. అయినా, పద్మావతి వాళ్లను వదలదు. పాత సబ్ ఇన్‌స్పెక్టర్ మొఖాన ఉమ్మేసిందని ఒక కథ చెబుతారు. అట్లాంటి కయ్యాలకోరు పద్మావతి అందరూ భయపెట్టినట్లుగా — ఇంతవరకు తనను మాత్రం తిట్టలేదు.

ఈ ప్రపంచాన్ని తిట్టడానికే పద్మావతి ఈ జన్మ ఎత్తిందని మాత్రం భాస్కరానికి అనిపించింది. అంతకన్నా తనకు ఇంకొక అర్ధవంతమైన కారణం కనిపించలేదు. పుట్టుకతోనే కొందరు నోరుపెట్టుకుని పుడతారు — ఆవుకు కొమ్ముల్లాగా, పులికి పంజా లాగ, ఈ పద్మావతి అట్లా పుట్టిందనిపించింది భాస్కరానికి.

'నీకు ఫోన్ భాస్కరం. మీ పెద్దన్నయ్య. విశాఖపట్నం నుంచే. మళ్లీ చేస్తారు. వచ్చి లోపల కూర్చో' అన్నారు శివన్నాయుడుగారు. అరవైయేళ్లు దాటిన శివన్నాయుడుగారు గాంధీవాదిగా పేరుపడ్డారు. ఆయన అలవాట్లూ, వేసుకునే బట్టలూ, గుండూ — అంతా అదే పద్ధతి. గాంధీజీకి పిలక ఒకటి ఉండేది. శివన్నాయుడుగారి కులాచారం ఒప్పదు కాబట్టి పిలక అవసరం లేకపోయింది.

ఉదయం ఏడు గంటలకే చలికి దుప్పట్లు కప్పుకుని ముగ్గురు నలుగురు, ఉన్ని స్వెట్టర్లతో తలకు మఫ్లర్‌లతో ఇద్దరు ముగ్గురు, ఎర్రటి శాలువా కప్పుకుని ఒకరూ శివన్నాయుడు బంగళా వరండా మీద ఆయన చుట్టూ చేరారు. అక్కడ చేరిన పెద్దమనుషుల ముఖాలను చూస్తే వాళ్లేదో గడ్డు సమస్యతో తలమునకలై ఉన్నట్లు కనిపించింది. కాంట్రాక్టర్ పెద్దరాజు, రైస్‌మిల్ యజమాని ఏనుగులాంటి గడ్డం బాలయ్యా, చౌకధరల దుకాణం డీలర్ కొంగకాళ్ల చిన్నం నాయుడూ, ముగ్గుబుట్టలా నెరిసిన జుత్తుతో హెడ్మాష్టర్ బసవరాజూ, ఎమ్. ఆర్. ఓ మీసాల గణపతీ, గ్రామ పాలనాధికారి ముప్పయ్యేళ్ల పొట్టి కాంతయ్యా — ఆ కూర్చున్న దృశ్యం చూస్తే పిడుగు పాటులాంటి సమస్య ఏదో వాళ్ల నెత్తిన పడ్డట్టే ఉంది.

'బాలయ్యా, చిన్న పామునైనా పెద్ద కర్రతోనే కొట్టాలి. ఇట్లాంటి సమస్యకు నీకు ఏ ఏమ్. ఎల్. ఏ గారినో, ఎమ్. పీ గారినో పట్టుకోవడం మంచిది.'

'అక్కడకైనా మీరే తీసుకెల్లాలి.'

'నా మాట విన్రా బాలయ్యా. మాట చెల్లని చోటుకు వెళ్తే జరిగే పని కూడా

జరగదు. పెట్టరాని చోట అడుగుపెడితే భంగపాటు తప్పదు. నాకు అవమానం అని కాదు, నీకు ప్రమాదం. నీ మంచి కోరి చెప్తున్నాను ఈ కష్టంనుంచి గట్టెక్కాలంటే సత్యం కాళ్లు పట్టుకోవాల్సిందే. మీ ఇద్దరి మధ్యా వైరం సంగతి నాకు తెలీదని కాదు. కానీ, ఇప్పుడు నీకు మరొక దిక్కు లేదు. వాడికి విశాఖపట్నంలో పోలీస్ డిపార్టుమెంట్‌లో పెద్దపెద్దవాళ్లు స్నేహితులున్నారు. సత్యంతో నేను మాట్లాడుతాను. నీవెళ్లి ఒకసారి ముఖం చూపించు. వాడు కాదనడు. అన్ని పనులు వాడే చూసుకుంటాడు. ఇంక నసలకు. తెలిసిందా, వెళ్లు' అని శివన్నాయుడు చెప్పిన మాటలను బట్టి భాస్కరానికి అర్థమయిం దేమిటంటే, బాలయ్య చిన్న తమ్ముడు ప్రతాప్‌ని పోలీసులు అరెస్టు చేశారని. నక్సలైట్ నాయకుడొకరు అతడి గదిలో పోలీసులకు దొరికాడట. నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నాడన్న ఆరోపణతో ప్రతాప్‌ని అరెస్టు చేశారట. ప్రతాప్ యూనివర్సిటీ విద్యార్థట. ఇప్పుడే అర్ధగంట కిందటే ఫోన్‌చేసి చెప్పారట.

దాంతో గెడ్డం బాలయ్యా, అతడితో వచ్చిన ముగ్గురు దుప్పట్లు కప్పుకున్న మనుషులు వెళ్లిపోయారు. ఇద్దరు నడివయసు ఆడవాళ్లు కొత్తగా వచ్చారు. వాళ్లు పల్లెటూరి వాళ్లే అయినా పెద్ద కుటుంబాల వాళ్లలాగ కనిపించారు. వాళ్లను ఇంటి లోపలికి పంపించారు శివన్నాయుడుగారు.

ఆ హాల్‌లో అడుగుపెడితే మ్యూజియంలో ఉన్నట్లు అనిపిస్తుంది భాస్కరానికి. పుస్తకాలతో నిండిన పాతకాలపు రోజ్‌వుడ్ నగిషీ బీరువాలు, అల్మారాలూ, గోడలకు వేలాడుతున్న మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి దేశనాయకుల ఛాయాచిత్రాలు, సంస్థానాల రాజుల వర్ణపటాలూ, తమ వంశానికి చెందిన మూలపురుషులు నిలువెత్తు తైలవర్ణచిత్రాలూ, పంగలకొమ్ములతో లేళ్ల తల కాయలూ, పులి చర్మాలూ, పాతకాలం నాటి ఈటెలూ, కత్తులూ, ఖడ్గాలూ, బాకులూ — వాటిని అద్దాల బీరువాల్లో భద్రపరిచిన తీరూ — శివన్నాయుడుగారి పూర్వీకుల కీర్తి వైభవాలకి అద్దం పట్టినట్లుగా ఉంటుందక్కడ. ఆ హాల్లో అంతా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం ఇష్టం భాస్కరానికి.

ఆ హాల్లో దక్షిణపు గోడకి ఆనుకుని ఉన్న బీరువా పక్కన, నేల మీద గోడ దగ్గర, పాతవెదురుబుట్టలో పొడవాటి ఆకుపచ్చ అరటికాయలగెల కనిపించింది. దొంగ ఎత్తుకుపోయాడని తిడుతున్న పద్మావతి అరటికాయల గెల ఇదేనేమో అనిపించింది భాస్కరానికి. దొంగ దొరికాడా? తగువు సర్పంచి దగ్గరకు వచ్చిందా? బయట సర్పంచితో కూర్చున్న వాళ్లలో దొంగ ఉన్నాడా? ఇంతకీ ఈ అరటికాయలగెల

పట్నాయక్ గారి పెరట్లోంచి పోయిందేనా? రమేశ్ పండాకి ఈ దొంగతనంతో సంబంధం ఏమిటి? పద్మావతి ఎందుకు తిడుతున్నట్లు? ఇన్ని తిట్టినా రమేష్‌పండా నోరు మూసుకున్నాడెందుకు? లేక ఈ అరటిగెల శివన్నాయుడు గారి తోటలోదా?

టెలిఫోన్ మోగింది.

"నీదేనేమో చూడు భాస్కరం." బైట నుంచి శివన్నాయుడు గారి గొంతు.

ఫోన్ తీసుకున్నాడు. తనకుకాదు, శివన్నాయుడుగారికే.

ఇంటినుంచి ఫోనంటే భయం పట్టుకుంది భాస్కరానికి. ఇంటర్వ్యూల పిలుపులు లేదా పెళ్లి సంబంధాలు... తాను వద్దన్నా ఇంట్లో ఒత్తిడి. పెద్దన్నయ్య మాట్లాడబోయేది పెళ్లి సంబంధం గురించి కాదు కదా. ఈ ఊరు విడిచి వెళ్లాలని లేదు. ఆ అమ్మాయి కనిపించలేదు. మూడు మాసాలయింది ఆ అమ్మాయిని తొలిసారి చూసి. ఈ ఊళ్లోనే ఉంది, కనిపిస్తుంది, తన కోసమే ఇక్కడ పుట్టింది. తాను ఇక్కడికి వచ్చింది ఆమెకోసమే. ఆమె కోసం ఎదురుచూడటం తప్పదు. తనకు పూర్తిగా నమ్మకం ఉంది. ఆమె వచ్చి ఏదో ఒకరోజు తన జీవితంలో ప్రవేశిస్తుంది, తప్పదు. తన ఆరాధనకు పరీక్ష ఇది. ఈ పరీక్షలో తాను నెగ్గాలి, ఓడి పోకూడదు. తన మనసు చలించదు. ఆ అమ్మాయి కోసం కోనేరు గట్టుమీద వెతుక్కుంటుంది.

ఫోన్ మోత. ఈసారి తనకే. పెద్దన్నయ్య గొంతు. యు.పి.ఎస్.సి ఇంటర్వ్యూ ఈ నెల ఇరవై మూడున ఉందట. నిన్న ఉత్తరం వచ్చిందట. రాత్రి ఫోన్ కలవలేదట. ఇంటర్వ్యూకు రెండువారాలు వ్యవధి ఉంది కానీ, వారందినాలు ముందే ఢిల్లీ చేరుకుంటే మంచిదేమోనని నాన్నగారు చెప్పమన్నట్లు పెద్దన్నయ్య భోగట్టా. పదిహేనురోజులు సెలవుపెట్టి రమ్మని. రిజర్వేషన్ చేయిస్తున్నారట.

నెలదినాల కిందట తండ్రి జోగయ్యపంతులు ఇక్కడికి వచ్చినప్పుడు శివన్నాయుడుగారు, తండ్రికి అతిథ్యమిచ్చి, తన బంగళాలోనే ఉంచుకున్నారు. అన్ని సదుపాయాలు ఉన్న కారణంగా తండ్రికి అక్కడ సరిపోయింది. దేవీభక్తుడయిన తండ్రికి ఏ ఊరు వెళ్లినా అక్కడ దేవాలయాల మీద ప్రత్యేక ఆసక్తి. ఓ సాయంత్రం, కోనేటి గట్టు మీద అమ్మవారి గుడికి పూజకోసం వెళ్లినప్పుడు ఆ విగ్రహం బౌద్ధశిల్పమని, కళింగపట్నం దగ్గర సాలిహుండాంలో ఉన్న బౌద్ధశిల్పాలకాలం నాటిదనీ ఒక కొత్త సంగతి చెప్పారు. ఈ దగ్గర్లోనే ఎక్కడో బౌద్ధశిథిలాలు ఉంటాయనీ, గొప్ప బౌద్ధవిహారం సమీపంలో బయటపడే అవకాశాలు ఉన్నాయనీ, అప్పుడు ఆ ఊరుకు ఎంతో ప్రాముఖ్యం వస్తుందనీ చెప్పారు. ఆ చుట్టుపక్కల నాలుగయిదు కిలోమీటర్ల దూరంలో ఈ ఆధారాల కోసం రెండు మూడు రోజులు

అమ్మవారి గుడి శుచీ శుభ్రతల కోసమని నక్కలూ, కుక్కలూ, లోపలికి పోకుండా నివారించాలని ఆగమశాస్త్ర పండితులను సంప్రదించగా గుడిచుట్టూ మండపం కట్టించవచ్చుని, ఆ మండపానికి తలుపులు పెట్టించవచ్చుని చెప్పారట. అయితే ఆ తలుపులు వేకువ జామునే తెరవాలట. దేవి పాదాలకు ఉదయభానుడి తొలికిరణాలు తాకాలని దాని ఉద్దేశమట. ఉత్తరాయణ, దక్షిణాయణాలలో సైతం అమ్మవారి పాదాలకు సూర్యభగవానుడు కిరణాంజలి ఘటిస్తాడని శివన్నాయుడుగారు చెప్పటం భాస్కరం మనసుకు హత్తుకుపోయింది. చెరువునీటి అలల మీద సూర్య కిరణాలు పడి ఆ వెలుగుల తళతళలు గుడిలో ప్రతిఫలించి, దేవీ దివ్య వదనం మందస్మితంగా మెరుస్తున్న దృశ్యం గురించి వర్ణించి చెప్పటం గుర్తుండిపోయింది..

సాలిహుండాంలోని మరీచి విగ్రహానికీ దీనికీ చాలా పోలికలున్నాయని తండ్రి అభిప్రాయం. మరీచికి ఉన్నట్టు మూడుముఖాలు, ఆరుచేతులు ఈ విగ్రహానికి లేకపోయినా శిల్పం మొత్తం అవే పోలికలట. కళాసంపన్నమైన ఇట్లాంటి విగ్రహమే పాశ్చాత్యదేశాలలో లేదా జపాన్, కొరియా, చైనా వంటి తూర్పుదేశాలలో బయటపడితే దాని చుట్టూ కొన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గొప్ప మ్యూజియం కట్టించేవాళ్లని తండ్రి ఆవేదన. ఆ కళారూపాన్ని నిత్యం చూడటానికన్నా ఆ ఊళ్లో జీవించవచ్చునిపించింది. దాంతో రెండువేల ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆ ప్రాచీన గ్రామం పట్ల తన లోపల్లోపల ఒక ఆరాధనాభావం పెరగసాగింది.

ఆ కోనేరు కూడా అంతే పురాతనమైనదట. తమ తాత ముత్తాతలూ, ఆ ముందు తరాలవాళ్లూ చెప్పుకుంటున్నదాన్ని బట్టి ఆ కోనేటిలో పడి మనిషిగాని, పశువుగాని చనిపోయిన ప్రమాదం ఏదీ ఇంతవరకు జరగలేదట. ఊళ్లల్లో ఏ చెరువు కథ విన్నా ఆడపిల్లల ఆత్మహత్యల కన్నీళ్లే కదా. ఈ కోనేరు అమ్మవారిక్షేత్రం కావటం వల్ల ఆ తల్లి కాపాడుతున్నదట. ప్రమాదవశాత్తూ మునిగిపోయిన చిన్నపిల్లలను సైతం పద్మహస్తాలతో దేవిఒడ్డుకు చేర్చుతుందట. రెండో రోజే ఉద్యోగం మానేసి వచ్చేస్తానని వెళ్లిన చిన్నకొడుకు భాస్కరం మూడు నెలలు ఇంటికి రాకపోయేసరికి విచిత్రం అనిపించి కొడుకును చూడటానికి వచ్చిన జోగయ్య పంతులుకు ఆ ఊరు చాలా నచ్చింది. ముఖ్యంగా అమ్మవారి విగ్రహం. భాస్కరం తండ్రి జిల్లా జడ్జిగా పదవీ విరమణ చేసిన సంగతి ఆ ఊళ్లో పెద్దలకి అప్పుడే తెలిసింది. దాంతో వాళ్లు భాస్కరం పట్ల మరింత ప్రేమాభిమానాలు కురిపించసాగారు. అన్నీ కలసి ఆ ఊరంటే అతడికి మరింత ఇష్టం ఏర్పడింది.

★ ★ ★

ఆవేళ బ్యాంకుకు వెళ్లేసరికి 'స్థానికులకు చోటు లేని ఉద్యోగాలు' అన్న శీర్షికతో పత్రికలో వచ్చిన వార్తను చూపించాడు క్యాషియర్ శేషగిరి. సిగరెట్ పొగలో అతడి చింతపిక్కరంగు ముఖం ఆ వార్తతో వినోదిస్తున్నది. చదివితే అది హెడ్మాస్టర్ బసవరాజు మీద ఎక్కుపెట్టిన బాణంలా తోచింది. ఆ ఊళ్లో ప్రభుత్వపరంగా ఉన్న ఆరు కార్యాలయాల్లో మొత్తం నలభై ఇద్దరు ఉద్యోగులన్నప్పటికీ కనీసం ఒక్కరయినా స్థానికుడు లేడట. భువనేశ్వర్, ఖరగ్‌పూర్, భిలాయ్, కలకత్తా, జంషెడ్‌పూర్ వంటి పొరుగు రాష్ట్రాలలోని పట్టణాలకు పొట్టచేత్తో పట్టుకుని కూలీలుగా, చిల్లర వ్యాపారులుగా పోయినవాళ్లు పోగా కనీసపు విద్యార్హతలున్న, తిండికి గతిలేని కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు ఊళ్లో దాదాపు అరవైమంది దాకా ఉన్నారట. హైస్కూలులో అటెండర్ నీలయ్య రిటైరైన తరువాత ఏర్పడిన ఖాళీలో స్థానికుని నియమించాలని కోరుతూ గ్రామయువజనసంఘం ఒక కరపత్రాన్ని ప్రకటించిన సంగతిని ఆ వార్తలో ఉటంకించారు. ప్రజల వద్దకు పాలన, శ్రమదానం సందర్భంగా పత్రికలో ఆ వార్త అచ్చు కావటంతో ఊళ్లో సంచలనం మొదలయింది. అటెండర్ నియామకం విషయంలో హెడ్మాస్టర్ తన నిస్సహాయతను ప్రకటించటం స్థానికులకు ఆగ్రహాన్ని కలిగించిందట. అంతటితో ఆగలేదు. ఉద్యోగాలలో పెద్దకులాల వారికే పెద్దపీట అని మరికొన్ని గణాంక వివరాలు పొందుపరిచాడు, పెద్ద కులానికి చెందిన వార్తాకారుడు రమేష్ పండా.

నీళ్లల్లో నిప్పును పుట్టించగల అంతటి ఘనుడు అరటిగెల తగువులో పద్మావతి చేత చివాట్లు తిని నోరు మూసుకోవటంతో ఆ దొంగతనంలో రమేష్ పండా చెయ్యి ఉందని కొందరి నమ్మకం. అయితే, ప్రతాప్‌ని బెయిల్ మీద విడిపించే వ్యవహారంలో సత్యం దొర సైతం సాధించలేని పనిని రమేష్ పండా వెళ్లి సాధించటంతో ఊళ్లో అతడి ప్రతిష్ఠ ఒక్కసారి రెట్టింపు అయింది. రమేష్‌పండా అంటే గిట్టనివాళ్లు సైతం ఆశ్చర్యపోయారు. సత్యం దొర హయాంలో— పనులు పలుకుబడితో జరిగేవి. ఇప్పుడు రమేష్ పండా హయాం వచ్చేసినట్టుంది. డబ్బు పారేస్తే ఏదన్నా సాధించవచ్చని రుజువయింది. ఈ ఘనవిజయంతో పద్మావతి తిట్లు, అరటిపళ్ల గెల తగువు వెనుకబడిపోయాయి. అరటి పళ్ల గెల తగువు అసలు తగువే కాదని తేలిపోయింది.

అదేరోజు పత్రికలో సంపాదకలేఖల్లో ఒక ఉత్తరం వచ్చింది. డాక్టర్లూ, మందులూ లేని ఊళ్లల్లోని ప్రభుత్వఆస్పత్రి భవనాలను ఉమ్మడి మరుగుదొడ్ల నిర్మాణానికి ఉపయోగించాలని దాని సారాంశం. ఒకానొక గ్రామంలో ఆస్పత్రిలో

ఏడాదిన్నరగా డాక్టర్ లేడట, మందులు లేవట. కంపౌండర్, ఆయా, నాలుగో తరగతి సిబ్బంది ఇద్దరు మాత్రం ఉన్నారట. వాళ్లకు జీతాలుగా సంవత్సరానికి రెండు లక్షల రూపాయలు మాత్రం ఖర్చువుతున్నదట. ఈ మొత్తంతో బోరువేసి, ఓవర్‌హెడ్ టాంక్ కడితే — సులభ్ పద్ధతిలో మరుగు దొడ్డి చేస్తే అది ఆ గ్రామ ఆరోగ్యానికే కాకుండా, గ్రామ పరిశుభ్రతకు ఆస్పత్రి కన్నా ఎన్నోరెట్లు ఉపయోగదాయకంగా ఉంటుందని ఉత్తరంలోని భోగట్టా.

కులాల మధ్య చిచ్చు పెట్టేకన్నా ఇట్లాంటి పని ఏదన్నా చేయవచ్చు కదయ్యా అని రమేష్ పండాతో రంగనాథం — బ్యాంక్ మేనేజర్‌గారన్నారట. రంగనాథంగారు పెద్దకులం వాడయి ఉంటే ఆ వ్యాఖ్యానానికి అర్థం ఎలా ఉండేదో గాని, ఆయన ఎస్. సి. దాంతో రమేష్ పండా చిరాకుపడ్డాడట.

కిందటి రోజు రాత్రి పొరుగూళ్లో ఓ పెళ్లికి వెళ్లిరావటానికి జీపు కావాల్సి వచ్చి సత్యందొరగారింటికి వెళ్లినప్పుడు పద్మావతి అరటిగెల అక్కడ కనిపించింది. అరటిగెల పండసాగింది. పైభాగమంతా లేతపసుపు పచ్చరంగు వచ్చింది. అరటిగెల తగువు సత్యందొర దగ్గరకు వచ్చిందంటే సర్పంచ్ శివన్నాయుడుగారి దగ్గర పరిష్కారం కాలేదని అర్థం. తన దగ్గర నీతిగా వ్యవహారం తెగకపోతే ఆ తగవు సత్యం దొర దగ్గరకు రావాల్సిందే.

'మీ అరటి గెల తీసుకుపో' అని పట్నాయక్‌కి సర్పంచి కబురు చేశారంట. అయితే, పద్మావతి ఒప్పుకోలేదట. తగవు చేసి ఆ దొంగతనం ఎవరు, ఎందుకు చేశారో తేల్చాలందట. ఆ దొంగకి తప్పు వెయ్యాలందట. అది తేల్చి న్యాయం చెప్పేవరకు ఆ అరటిగెల ముట్టుకోనని ఆ కబురు తెచ్చినవాడికి జవాబు చెప్పిందట. దొంగని దొంగా అనడానికి ఈ పెద్దలంతా ఎందుకు కిందా మీదా పడిపోతున్నారని నిలదీసిందట. ఆ దొంగతనం ఎవరు చేయించారో అది బయటికి రావాల, అందరికి తెలవాల అని పట్టుపట్టిందట.

ఈ వ్యవహారాన్ని సత్యం దొర ఎట్లా పరిష్కరిస్తారో అని చూస్తున్నారు జనం. సత్యందొరది సులువెరిగిన దారి. వయసులోని పిల్లలు చేసిన పెంకితనం ఈ అరటి గెల పని అన్నారట. అదే నిజంకూడానట. 'సూద్రా పద్మమ్మని ఏడిపిస్తాను' అని, పంతం కొద్దీ' రమేష్ పండా సరదాకి చేయించాడని చెప్పుకున్నారు. కావలిస్తే ఆ అరటిగెల కాకుండా, దానితో పాటు ఓ రెండు వందల రూపాయలు పద్మమ్మకి ఇవ్వటానికి కూడా సిద్ధపడ్డాడట. కానీ, సమాధానం కుదరలేదు. 'ఆడు పెంకి అయితే నేను జగపెంకిని' అన్నదట పద్మావతి. ఈ నిప్పు రాజుకోకుండా తగవు సత్యం దొర

తేల్చేస్తాడని అందరి నమ్మకం. ఈ పెద్దమనుషులంతా దొంగలే అని, కొందరు కనిపించని దొంగలనీ, మరికొందరు కనిపించే దొంగలనీ, అందుకే దొంగని దొంగ అనడానికి వెనుకాడుతున్నారని ఊళ్లో జనం అనుకోవటం భాస్కరం విన్నాడు. ఆ మాటలో నిజం ఉన్నట్టే అనిపించింది. రమేష్ పండా మంచివాడనో, చెడ్డవాడనో పాలూ నీరులాగ విడదీసి చెప్పలేకపోవచ్చుగానీ గడుసువాడని మాత్రం అందరూ ఒప్పుకుంటున్నారు. వాడు పరమ చెడ్డవాడని పద్మావతి తిట్ల అర్థం. ఏ తప్పూ ఎరగని వాళ్లని ఏడిపించాలని ఎత్తుకున్నవాడు మంచి వాడెలాగవుతాడని, ఆడిని అలాగే పెరగనిస్తే, ఆడు పిచ్చికుక్కలాగ తయారవుతాడని పద్మావతి తిట్ల వెనుక ఒక తర్కం ఉన్నట్లు భాస్కరానికి స్పష్టాస్పష్టంగా అనిపించసాగింది. చెడ్డవాడు మంచిపని చెయ్యగలడా అన్న సంశయం కూడా ఏర్పడింది. పత్రికలో రాతలు మంచి సంగతుల్లా కనిపిస్తున్నా దాని వెనుక నిజంగా మంచి ఉందా? లేక ఇదంతా అవకాశం కోసం కొంగజపం లాంటిదా? మిడతంబొట్లు వ్యవహారమా?

అరటి గెల తగవు ఆ ఊళ్లో మునగక తేలక సాగుతుండగా మరొక కొత్త తగువు మొదలయింది.

హైస్కూలులో లెక్కలమేష్టరు సింహాచలం బస్టాండ్ దగ్గర నాయర్ హోటల్‌లో టీ తాగుతూ పద్మావతికి కనకాంబరం పెళ్లాంతో పోలిక తెచ్చి 'కనకాంబరం పెళ్లాం ఊరొదిలి చిట్‌ఫండువాడితో లేచిపోయింది. ఇది అలా కూడా పోదు. దీనిక్కూడా ఒక కర్ణుడు పుడతాడు. అప్పుడుగాని దీని నోరు మూతపడదు' అన్నాడట.

ఆ లెక్కల మేష్టరు గురించి భాస్కరానికి తెలుసు. తన చుట్టూ ఉన్నవాళ్లని వినోదింపజేయటానికి శృంగార కథలు పేరుతో బూతులు చెప్పటం అతడి సరదా. అది పద్మావతి కావటమే అతడి దురదృష్టం. ఆ మేష్టరు మధ్య వయసువాడు. పెళ్లిళ్లు చేసిన కూతుళ్లున్నారు. రోజూ ఆమె తిట్టే తిట్లకు, ఇవాల్టి తిట్లకూ మధ్య చాలా భేదం కనిపించింది. ఇవేళ సింహమయింది. నిప్పులు కక్కింది. మధ్యమధ్య పద్మావతి కన్నీళ్లు పెట్టుకోవటాన్ని భాస్కరం గమనించాడు. కోడలుకు కానుపురోజులని కొడుకు వచ్చి తల్లి రాధమ్మని నిన్ననే తీసుకుపోయాడు. తల్లి ఉన్నా బావుండేది. తిట్లతో ఆగక 'నాయర్ హోటల్ కాడనే చెప్పు తీసి కొట్టకపోతే నా పేరు పద్మావతి కాదు' అని శపథం చేసింది. ఆ ముందు రాత్రి జ్వరమొచ్చి బ్యాంకుకు సెలవుపెట్టి ఇంట్లోనే ఉన్న భాస్కరానికి మొట్టమొదటిసారిగా పద్మావతి అంటే అభిమానం కలిగింది. ఆమె తరపున తానుకూడా పోయి లెక్కలమేష్టరుని తన్నాలనిపించింది. ఆమెని ఓదార్చాలని పించింది. ఆమె కన్నీళ్లు తుడవాలనిపించింది. రమేష్ పండాలూ, లెక్కల మేష్టరు

సింహాచలాలూ ఉన్న ఊళ్లో పద్మావతి గయ్యాళి కాకుండా ఎట్లా బతకగలుగుతుంది అనుకున్నాడు భాస్కరం.

అది జరిగిన రెండు రోజుల తర్వాత ఒరిస్సా, ఆంధ్రా సరిహద్దులో కొన్ని లక్షలరూపాయలవిలువ చేసే ఖరీదయిన విదేశీమద్యంతో ఒకలారీ పోలీసులకు పట్టుబడింది. ఆ లారీని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిసి జనం చూడ్డానికి ఎగబడ్డారు. ఇరుగుపొరుగు ఊళ్లనుంచి సైతం జనం వచ్చారు. విచిత్రం ఏమిటంటే, ఆ లారీ ఎవరిదో అందరికీ తెలిసినట్లే చెప్పుకోసాగారు. జిల్లాలో పెద్ద రాజకీయనాయకుడూ, పారిశ్రామికవేత్తా, వ్యాపారీ — అంతటి పెద్దనాయకుని లారీ పట్టుకున్నారంటే పోలీసులకు పుట్టగతులుండవని జనం పోలీసులపట్ల సానుభూతితో మాట్లాడటం భాస్కరానికి వింతగా అనిపించింది. ఎస్.ఐ శేషయ్యతో అతనికి స్నేహం. ఈ విదేశీమద్యం లారీని చూడ్డానికి వెళ్తే అక్కడ ఎస్.ఐ గదిలో అరటిగెల కనిపించింది. అరటిగెల చివరికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిందన్నమాట. అంటే, సత్యం దొర సైతం తగవు తీర్చలేక చేతులెత్తేశాడన్నమాట. అప్పటికి అరటిగెల పూర్తిగా పండిపోయింది. పై పెడలోని మూడు నాలుగు పండ్లు ఊడి వేలాడుతున్నాయి. ఎస్.ఐ. శేషయ్య ఈ తగవు ఎట్లా తీరుస్తాడో చూడాలన్న కుతూహలం కలిగింది భాస్కరానికి.

శేషయ్య ఆ ఇంటికి తరచు వస్తూ ఉంటాడు. ఆయన భార్యా పిల్లలూ వచ్చి పోతుంటారు. పద్మావతి అంటే వాళ్లకు చాలా ఇష్టం. పద్మావతికి శేషయ్య అంటే గౌరవం. పట్నాయక్, రాధమ్మ అయితే కొడుకుతో మాట్లాడినట్లుగానే మాట్లాడతారు. అందుచేత అరటిగెల తగవు పరిష్కారం ముగింపుకు వచ్చిందనే అనిపించింది. శేషయ్య మంచివాడనీ, పట్నాయక్ వాళ్ల కుటుంబానికి స్నేహితుడనీ తెలిసినవాళ్లు రమేష్ పండాని పిలిపించి తిట్టి, తప్పు ఒప్పించి, వాడిచేత లెంపలు వేయించి గుంజీలు తీయిస్తాడని, దాంతో పద్మావతి కోపం తగ్గిపోతుందని ఆశించారు. శేషయ్య పిలిపించాడో లేదోగాని, రమేష్ పండా మాత్రం పోలీస్ స్టేషన్ దగ్గర ఓ పూటంతా ఉన్నాడు. పోలీస్ స్టేషన్ సైతం తన రాజ్యంలోదే అన్నట్లుగా వ్యవహరించే రమేష్ పండా ముఖంమీద రంగు వెలిసిపోవటం కొందరు గమనించి, తిట్లు తిన్నట్టున్నాడు గురుడు అనుకున్నారు. అయినా, పోలీస్ స్టేషన్‌లో వ్యవహారం ఏం జరిగిందో మాత్రం బయట పడలేదు.

'లక్షలాది రూపాయల విదేశీమద్యంతో లారీమాయం' అని తాటికాయంత అక్షరాలతో తొలిపుటలో మూడు కాలాల వార్త ఆ రెండో రోజు పత్రికలో వచ్చినప్పుడు

ఆ గ్రామం మొత్తం ఓడిపోయినట్లుగా అనిపించింది భాస్కరానికి. జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్న ఆ లారీ జిల్లా కేంద్రానికి పోతుండగా మధ్యలో ఈ మాయ జరిగినట్లు పత్రిక భోగట్టా. ఖాళీ లారీ మాత్రమే చిక్కిందట. ఆ వార్త కిందనే ఆ లారీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అనబడే రాజుగారు చేసిన ప్రకటన ఒకటి వెలువడింది. రాజకీయ ప్రత్యర్థులు వ్యాపారస్పర్థతో, తమ కంపెనీని అప్రతిష్ఠపాలు చెయ్యాలన్న దురుద్దేశంతో, కుట్రతో, విదేశీ మద్యంతో తమ కంపెనీకి చెందిన లారీని పోలీసులు పట్టుకున్నట్లు కట్టుకథ అల్లి పత్రికలో ప్రకటించినట్లు దాని సారాంశం. ఈ వార్తను ప్రచురించిన పత్రికలు, పై తప్పిదానికి వెంటనే పెద్ద అక్షరాలతో, తొలిపుటలో కంపెనీకి క్షమాపణ చెప్పుకోకపోతే ఆ పత్రికల మీద .పరువునష్టం దావా వెయ్యబోతున్నట్లు హెచ్చరికను ఆ ప్రకటనలో పొందుపరిచారు.

ఇట్లాంటి మాయా ప్రపంచంలో అరటిగెల కోసం పోరాడుతున్న పద్మావతిని చూస్తే జాలి కలిగింది భాస్కరానికి. పోరాటంవల్ల న్యాయం జరుగుతుందన్న నమ్మకం వట్టి భ్రమేనేమో అనిపించింది. అంతలో ఉమ్మడి మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి రెండు నెలలుగా చేస్తున్న తన కృషికి ఫలితం ఇట్లాగే ఉంటుందేమోనన్న సందేహం కెరటంలా ఫెడీమని అతన్ని కొట్టింది. ఊరుకు దక్షిణంగా ఒకటి, ఉత్తరంగా ఒకటి–సులభ్ పద్ధతిలో రెండు ఆధునికమైన మరుగుదొడ్ల సముదాయాల నిర్మాణానికి సంబంధించి తాను తయారు చేసిన బ్లూప్రింట్ తన ముఖాన నవ్వుతున్నట్లయింది. ఆర్థిక వనరులు పోగుచేసే పనిలో అధికారులను, ప్రజాప్రతినిధులను, ఉదారులను ఎందరినో కలుసుకుని వాళ్లతో మాట్లాడాడు. అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా అంతా తీయగా మాట్లాడతారుగాని పని సాగదు. ఏ అధికారీ ఏ నిర్ణయమూ సొంతంగా తీసుకోడు. పైకి రాస్తానంటాడు. అధికారుల పేర్ల జాబితా చదువుతాడు. రాయడు. క్లర్క్ సెలవులో ఉంటాడు. టైపిస్టు మెటర్నిటీ లీవులో ఉంటుంది. ఏ పనీ జరగదు. దాంతో విసుగెత్తిపోయిన భాస్కరానికి ప్రజలు స్వయంగా చేసుకోవటమే సులభ మార్గమనిపించింది. ఊరికి రెండు వేపులా ఈ సముదాయాలు సులభ్ పద్ధతిలో కట్టడానికి స్థలం ఇవ్వడానికి సత్యం దొర ఒప్పుకున్నాడు. ఒక స్థలంలో పాత బావి ఉంది. దానికి మోటారు పెట్టుకుంటే నీటి సదుపాయం ఏర్పడుతుంది. రెండో స్థలంలో బోరు వేయించే ఖర్చు తాను భరిస్తానని శివన్నాయుడు గారు అన్నారు. సత్యసాయి సేవా సమితివాళ్లు శ్రమదానంతోపాటు, వాటి నిర్వహణని ఒక ఏడాదిపాటు తాము చేపడతా మన్నారు. సెప్టిక్ ట్యాంకులు తవ్వడానికి యువజన సంఘంతో మాటలు జరుగుతున్నాయి. అంతా ఒక కొలిక్కి

వస్తున్నట్లు కార్యక్రమం ఆశాజనకంగా సాగుతుండగా, విదేశీ మద్యంతో లారీ మాయం కథ తన కళ్ల ముందే జరిగి నీరుగారిపోయాడు భాస్కరం. ఒక మంచి పనికి ఎన్ని ఆటంకాలో అనిపించింది. పాపం శేషయ్యను చూడాలి. ఎంత కుంగిపోయి ఉంటాడో కదా అనుకున్నాడు. ఆ సాయంత్రం కలిసినప్పుడు శేషయ్య ముఖంలో ఆ విచారమే కనిపించలేదు. నవ్వేసి 'మామూలే' అన్నాడు.

'అయితే ఇట్లా జరుగుతుందని మీకు తెలుసా?'

'తెలుసు' అన్నాడు శేషయ్య ఠక్కున తడుముకోకుండా.

'తెలిస్తే మరెందుకు జాగ్రత్తపడలేదు?'

'నల్లోడి మాయ' అని నవ్వేశాడు శేషయ్య.

ఈ మాయ గురించి శేషయ్యకీ తెలుసు, రమేష్ పండాకీ తెలుసు, సత్యం దొరకీ తెలుసు, శివన్నాయుడిగారికీ తెలుసు. తనకే తెలీదు. అందుకే చిత్రం అనిపించింది భాస్కరానికి. పూర్తిగా జ్వరం తగ్గి ఆ రోజు పద్మావతిని అడిగి వేణ్ణీళ్లు పెట్టించుకుని స్నానం చేశాడు. ఆకలనిపించింది. నాయర్ హోటల్‌లో అన్నం తిన్నాడు. రసం అన్నం. పొద్దు పూర్తిగా కుంకిన తర్వాత కోనేటి గట్టుకు వెళ్లాడు. ఏదో గ్రామపండుగ ఆ రోజు. అమ్మవారి మండపం అంతటా దీపాలు వెలుగుతున్నాయి. కొన్ని వందల దీపాలు. గంటలు మోగుతున్నాయి. భక్తులతో, పసుపుకుంకుమ పూజలతో, కొత్త రంగురంగుల చీరలతో, ముఖ్యంగా ముత్తయిదువులైన ఆడవాళ్లతో కోనేటిగట్టు మొత్తం కిటకిటలాడుతున్నది. చుట్టూ సాంబ్రాణి గుగ్గిలం ధూపం వాసనలు. పండ్లూ, ఫలహారాలూ, ప్రసాదాలూ, కొత్త కొబ్బరి చిప్పల్లో పానకాలూ పంచిపెడుతున్నారు.

ఆ జనంలో మండపం దగ్గర వేపచెట్టు కింద నుంచుని గుడివేపు చూస్తున్న తన చేతిలో అరటాకులతో ఇద్దరికి కడుపు నిండేంత ప్రసాదం పెట్టిందొక ముత్తయిదువు. ఆమె సత్యం దొర చిన్న భార్య. ఆ ప్రసాదం ఏం చేయాలో తోచక మండపం వేపు వెళుతూ, ఇంతకీ ఇది బౌద్ధశిల్పమా, లలితా దేవి విగ్రహమా అన్న ఆలోచనతో సతమతమవుతున్న భాస్కరానికి గుడి దగ్గర రేవులో పావంచాల మీద ముదురాకు పచ్చరంగు చీర అమ్మాయి ప్రత్యక్షమయింది. ఎన్నాళ్లకి! ఎంత తపస్సు తర్వాత!

సంధ్యాకాశం లోకం మీద విరజిమ్ముతున్న చిక్కటి పసుపూకుంకుమ రంగుల కింద మెరుస్తున్నాయి కోనేటిజలాలు. ఆ రేవున ముదురాకు పచ్చరంగు చీర అమ్మాయి పూజాపళ్లేన్ని పావంచాల మీద పెట్టి కాళ్లు కడుగు కుంటున్నది. అవును, ఆమెనే. ఎన్నాళ్లకు! నిజమా! ఆమేనా! ఇటు — మండపంవేపు తన దిక్కుగా వస్తుందా? లేక క్రిందటిసారి మల్లె మళ్లీ అదృశ్యమైపోతుందా?

అవును, అదే చీర. తన స్వప్నాలలో ముద్రితమైన అదే రూపు. యౌవనం బరువును నిలకడగా ఉంచి సగితూగుతున్న వయసు. కళ్లార్పకుండా చూస్తూ కూర్చున్నాడు. ఆమె గుడివేపు వెడుతున్నది. తాను వెళ్లాలి. గుడి వెలుతురులో ఆమెను చూడాలి. ఆమె రూపురేఖలు ఇప్పుడన్నా గుర్తు పట్టాలి. గుర్తుంచుకోవాలి. అవును, అదే ముదురాకు పచ్చరంగు చీర, మందారపు రంగు ఎర్రంచు. అవును, ఈ పూలదండనే, ఈ దేవతనే తను వెతుకుతున్నది. ఆమె గుడివేపు వెళుతున్నది. తన చేతుల్లో అరటాకులో ప్రసాదం. అక్కడే మండపం పాలరాతి నేలమీద ఆ ప్రసాదాన్ని పెట్టి, జనంలోకి గుడివేపు నడక సాగించాడు భాస్కరం. నిండా పసుపు రాసుకుని, మెడకి చందనం పూసుకున్న పూలవాసనలతో భక్తురాళ్లు.

గుడిద్వారం ముందు ఇరవై ముప్పయ్‌మంది భక్తులు. అందరూ ఆడవాళ్లే. ముఖ్యంగా వయసులో ఉన్నవాళ్లే. దేవీ విగ్రహం కనిపించదు. అంతా అడ్డం. భక్తులు పక్కకు తప్పుకున్నప్పుడు చెమటలు కక్కుకుంటున్న పూజారి మాత్రం కనిపించాడు. పూజాపళ్లేలు అందుకుంటున్నాడు. దేవి దగ్గర పెట్టి, దేవి పాదాలచెంత పసుపు తీసి పూజాపళ్లెంలో పెట్టి, గుడిలో పోగులు పోగులుగా పడి ఉన్న ఇన్ని పూలను తీసి పళ్లెంలో వేసి భక్తులకు వెనక్కి ఇస్తున్నాడు. దేవి పాదాల దగ్గర కుంకుమ తీసి భక్తుల నుదుట బొట్టు పెడుతున్నాడు. మధ్య మధ్య శంఖనాదాలు. జేగంటల మోత.

భాస్కరం ఆ జనానికి అంతదూరంలో ఆగిపోయాడు. ఆమె — ముదురాకు పచ్చరంగు లోపలికి చొచ్చుకుపోయింది. ఆమె ముఖం తనకు కనిపించలేదు. ఆమె రూపు చూపుకు దొరకలేదు.

అయిదారుగురు భక్తులు పూజ ముగించి వెనక్కి వచ్చారు. గుడిద్వారం ముందు ఖాళీ అయింది. అమ్మవారి ముఖం కనిపించింది. అమ్మవారి విగ్రహం పూలదండలతో మునిగిపోయింది. బంతి పూలదండలు, మందారాల దండలు. కేవలం ముఖం మాత్రమే కనిపిస్తున్నది.

మరో అయిదారుగురు భక్తులు తప్పుకున్నారు. ఇప్పుడు గుడి ద్వారం సైతం కనిపిస్తున్నది. గుడిలో దేవి విగ్రహం దగ్గర ఓ కొత్త వెదురుబుట్టలో అరటిపళ్లగెల. అదే పద్మావతి అరటిగెల. పై పెడలో నిండా పండిన నాలుగైదుపళ్లు ఊడిపోయి రాలిపోవడానికి సిద్ధంగా వేలాడుతున్నాయి.

చివరికి అరటిగెల అమ్మవారి దగ్గరకు చేరిందన్నమాట!.

పద్మావతి అరటిగెల మొక్కుబడిని శేషయ్య తీర్చినట్లా?

సాంబ్రాణి ధూపం. ఆ పొగలో దేవీ రూపం. ముదురాకు పచ్చరంగు చీర పూజ

ముగిసింది. నుదుట కుంకుమబొట్టు పెట్టి పూజారి పళ్లేన్ని వెనక్కి ఇస్తూ పూలన్నీ తీసి ఆమె దోసిట పోశాడు. ఆమె పూజాపళ్లెం అందుకుంది.

ఆమె వెనక్కి తిరిగింది.

తన స్వప్నంలో కనిపించిన పూలదండ. నిత్యం తనకు కనిపించే కయ్యాల కోరు, జగడాలమారి. రోజూ చూస్తూ కూడా గుర్తుపట్టలేని తన స్వప్నం ఈ పద్మావతేనా?

* * *

వార్షిక సాహిత్య సంచిక
*96* ఇండియాటుడే